క్లుప్తంగా

9 నుంచి వై ఏపీ నీడ్స్ జగన్

ఉలవపాడు: మండలంలో ఈ నెల 9 నుంచి ఏపీకి జగనే ఎందుకు కావాలనే అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జేసీఎస్ మండల కన్వీనర్ ధనకోటేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 9న ఉలవపాడు1, 10న ఉలవపాడు-2, 14 న ఉలవపాడు-3, 15న భీమవరం-1, 16న భీమవరం-2, 17న చాగల్లు, 20న చాకిచర్ల, 21న కరేడు-1, 22న మన్నేటికోట, 23న వీరేపల్లి గ్రామాల్లో జరుగుతుందన్నారు. మండల పరిధిలోని వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు హాజరు కావాలని కోరారు.

రైతులు ఆర్‌బీకేల్లో సంప్రదించాలి

జరుగుమల్లి: శనగ విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని వ్యవసాయాధికారి యుగంధర్‌రెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానవన సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం ఎకరానికి 40 కిలోల సబ్సిడీ శనగలు ఇస్తున్నామన్నారు. రైతులు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సబ్సిడీపై శనగ విత్తనాలు

కొండపి(సింగరాయకొండ): మండలంలోని రైతు భరోసా కేంద్రాలలో ఈనెల 6వ తేదీ నుంచి సబ్సిడీ పై శనగ విత్తనాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుందని వ్యవసాయాధికారి డి.వి జయకుమార్ అన్నారు. శనగ విత్తనాలను 40 శాతం సబ్సిడీపై అందిస్తున్నామన్నారు. శనగ విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జెరాక్స్, మొబైల్ ఫోన్ తీసుకుని గ్రామంలోని వీఏఏను కలిసి తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, వీటితో పాటు పంట తప్పనిసరిగా వేస్తానని ధృవీకరణ పత్రం కూడా ఇవ్వాలని ఆయన వివరించారు.

పరీక్ష ఫీజు రూ.125 వసూలు చేయాలి

సింగరాయకొండ: పదో తరగతి చదివే విద్యార్థుల వద్ద పరీక్ష ఫీజు రూ.125 మాత్రమే వసూలు చేయాలని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు ఎంఈఓ-1 బి.శివన్నారాయణ సూచించారు. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు రూ.1,200 నుంచి రూ.1,500 వరకు వసూలు చేస్తున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. తన విచారణలో ఎవరైనా అధికంగా వసూలు చేసినట్లు నిర్ధారణ అయితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల కేంద్రంలోని కొన్ని ప్రైవేట్ పాఠశాలలను శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు.

లే అవుట్‌లకు అనుమతులు తప్పనిసరి

గుడ్లూరు: గుడ్లూరు మండల పరిధిలో లేఅవుట్లు వేయాలంటే గ్రామ పంచాయతీ అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు తెలిపారు. గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా నేరుగా నుడా అనుమతులకు దరఖాస్తు చేసుకొని ఆన్‌లైన్‌లో వస్తున్న అప్లికేషన్ నంబర్‌ను పొంది నుడా అప్రూవల్ ఉన్నట్లుగా స్థలాల అమ్మకం, కొనుగోలు చేన్నారని తెలిపారు. నుడా అనుమతులు ఉన్నా కచ్చితంగా గ్రామ పంచాయతీ అనుతమలు ఎల్‌పీ నంబర్లు ఉంటేనే అమ్మకాలు, కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. దీన్ని కొనుగోలుదారులు, అమ్మకందారులు గమనించాలన్నారు. అలా అనుమతులు లేకుండా కొనుగోలు చేసిన లేఅవుట్లలోని స్థలాలకు పంచాయతీ బాధ్యత వహించదన్నారు. దీనిని ప్రజలు గమనించాలని కోరారు.


పోలింగ్ కేంద్రాల తనిఖీ

గుడ్లూరు: మండలంలోని చేవూరు, ఏలూరుపాడు, గుడ్లూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ సూర్యనారాయణసింగ్, ఎంపీడీఓ రాజశేఖరరావు శనివారం తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు నమోదు కార్యక్రమాన్ని, వసతులు పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలని బీఎల్వోలకు సూచించారు. ప్రకటించిన ఓటర్ల జాబితాలోని తప్పులు, సవరణలను జాగ్రత్తగా చూడాలన్నారు. 18 ఏళ్లు నిండిన యువతీ యువకులంతా ఓటరుగా నమోదు చేసుకోవడం వారి హక్కన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్టు

లింగసముద్రం: స్థానిక పంచాయతీలోని బలిజపాలెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్న ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై ఎం.బాజీబాబు తెలిపారు. శనివారం మధ్యాహ్నం బలిజపాలెంకు ఉత్తరంవైపు ఉన్న వాగు వద్ద పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి దాడి చేసి పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.9,440 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై చెప్పారు.

వెంకయ్య స్వామికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న వెంకయ్యస్వామి

జరుగుమల్లి: మండల పరిధిలోని కె.బిట్రగుంటలో భగవాన్ వెంకయ్య స్వామి దేవస్థానంలో శనివారం భక్తులు పలు విశేష పూజలు నిర్వహించారు. దేవాలయ అర్చకులు మురళీకృష్ణశర్మ వెంకయ్య స్వామికి అభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి అష్టోత్తర నామావళి పూజలు నిర్వహించి భక్తులకు నామార్చనలు చేశారు. దేవాలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమాన్ని ఉభయ దాతలు కుంచాల శేషయ్య, కృష్ణారావు నిర్వహించారు.

మహిళల ఆర్థిక బలోపేతమే లక్ష్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు


డ్వాక్రా మహిళలతో మాట్లాడుతున్న వరికూటి

సింగరాయకొండ: మహిళల ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం-4 పరిధిలోని బాలయోగినగర్ మండల పరిషత్ పాఠశాలలో మహిళా సాధికారతపై శనివారం సాయంత్రం డ్వాక్రా మహిళలకు నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు.రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తున్న అనేక సంక్షేమ పథకాలలో మహిళలకే పెద్ద పీట వేసిందని గుర్తు చేశారు. వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత, అమ్మ ఒడి, వైఎస్సార్ భరోసా వంటి పథకాలతో పాటు మహిళలకు 50 శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్న ఏకైక ప్రభుత్వం అని కొనియాడారు. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ, జగనన్న బడుగు వికాసం వంటి పథకాల ద్వారా 35 శాతం సబ్సిడీపై రూ. లక్ష నుంచి రూ.కోటి వరకు ఎటువంటి హామీ పత్రాలు లేకుండా వ్యక్తిగత పూచీకత్తుపై బ్యాంకు రుణం సౌకర్యం అందిస్తుందన్నారు. ఈ రుణంతో టెంట్ హౌస్, సెంట్రింగ్, ఎంబ్రాయిడరీ, జిగ్‌జాగ్ వంటి యూనిట్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. అలాగే చిక్కి తయారీ యూనిట్లు, చపాతీ మేకింగ్, బిస్కెట్ తయారీ, నూడిల్స్, అప్పడాలు తయారీ వంటి యూనిట్లు, వీటితో పాటు గొర్రెలు, గేదెలు, కోడిగ్రుడ్ల తయారీ, బాతుగుడ్ల తయారీ యూనిట్లు ఏర్పాట్లు చేసుకోవచ్చని, కారు, ఆటో వంటి వాహనాలు కొనుగోలు చేసుకోవచ్చని వివరించారు. యూనిట్ ఏర్పాటు చేసుకునేందుకు ఉత్సాహంగా ఉన్న మహిళలు ఆధార్‌కార్డు, పాన్‌కార్డు, ఇంటి కరెంటు బిల్లు, ఫోన్ నెంబరు, ఇమెయిల్ ఐడీతో పాటు బ్యాంకు సివిల్ స్కోర్ బాగుండాలని వివరించారు. ఈ డాక్యుమెంట్లను తీసుకుని సంబంధిత అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. మండలంలో 100 మందికి పైగా వివిధ యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు మహిళలు దరఖాస్తు చేసుకున్నారని, ఎంత మంది దరఖాస్తు చేసుకున్నా రుణాలు ఇస్తామని ఏపీఎం డి.జయరాజ్ అన్నారు. ఈ సందర్భంగా సబ్సిడ పై రుణంపై తీసుకున్న కారును వరికూటి స్వయంగా నడిపి ప్రారంభించారు. కెనరా బ్యాంకు మేనేజర్ కంచర్ల సౌమ్య, రాష్ట్ర వడ్డెర కార్పోరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, సీసీలు ఎం వెంకట్రావు, సాంబశివరావు, మల్లికార్జున, జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, యన్నాబత్తిన చిన్నా, షేక్ పటేల్, షేక్ సలీంబాషా, శ్రీహరిరెడ్డి, వీఓఏ సంఘాల అధ్యక్షురాళ్లు ఇండ్ల సుజాత, చలంచర్ల అంబిక, తన్నీరు అరుణ, కుంచాల శాంతి, షేక్ కరీం, ప్రసాద్ పాల్గొన్నారు.

ఓటరు నమోదు పారదర్శకంగా నిర్వహించాలి


సింగరాయకొండలో పోలింగ్ బూత్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్


ఓటర్ల జాబితాను పరిశీలిస్తున్న ఆర్డీవో జాన్ ఇర్విన్

పామూరు: ప్రత్యేక ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్‌ఓలు పారదర్శకంగా నిర్వహించాలని కనిగిరి ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్ అన్నారు. పామూరులోని బీఎల్‌వో కేంద్రంలో శనివారం నిర్వహిస్తున్న ఓటర్ల నమోదు ప్రత్యేక క్యాంపెయిన్‌ను ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఓటర్ల జాబితాను పరిశీలించిన ఆర్డీవో మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన వారందరిచేత బీఎల్‌వోలు విధిగా నూతన ఓటు కోసం దరఖాస్తులు చేయించాలన్నారు. అదేవిధంగా ఓటర్ల జాబితాలో తప్పుల సవరణతోపాటు, ఓటర్లు ఎవరైనా వారి వివరాల్లో తప్పులు ఉంటే సవరణలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. శాశ్వత వలసలు ఉన్నా, ఓటుహక్కు ఉన్నవారు మృతి చెందినా వారి పేర్లు పూర్తి ఆధారాలతో ఓటర్ల జాబితా నుంచి తొలగించాలన్నారు. రాజకీయ, ఇతర వత్తిడులకు తలొగ్గి ఓటరు జాబితా ప్రక్రియలో అక్రమాలకు పాల్పడితే బీఎల్‌ఓలు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ ఆవుల సురేష్, ఆర్ఐ బి.మల్లికార్జున, బీఎల్‌ఓ షేక్.షరీఫ్, సిబ్బంది ఉన్నారు.

సింగరాయకొండ: ఓటు నమోదుకు నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌ను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ సీహెచ్ ఉష అన్నారు. మండలంలో శనివారం అన్ని పోలింగ్ స్టేషన్లలో జరుగుతున్న ఓటు స్పెషల్ డ్రైవ్‌ను తనిఖీ చేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఆదివారం కూడా కొనసాగుతుందన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీజీ, ఆర్ఎస్ ప్రాథమిక పాఠశాల, శ్రీరాంనగర్‌లోని పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఊళ్లపాలెం ఉన్నత పాఠశాలలో ఉప సర్పంచ్ కె.వెంకారెడ్డి ఓటరు జాబితాను పరిశీలించారు. డిప్యూటీ తహశీల్దార్ తన్నీరు వెంకటేశ్వరరావు, కె.సుజాత, జూనియర్ అసిస్టెంట్ శివ, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

సీఎస్‌పురం (పామూరు): పారదర్శక ఓటరుజాబితాను రూపొందించేందుకు బీఎల్‌ఓలు అంకిత భావంతో, అప్రమత్తతో పనిచేయాలని కనిగిరి ఆర్డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్ అన్నారు. మండల కేంద్రమైన సీఎస్‌పురం, కోవిలంపాడు, అరివేములలోని బీఎల్‌వో కేంద్రాలను శనివారం కనిగిరి ఆర్డీవో పాలపర్తి జాన్ ఇర్విన్ తనిఖీచేశారు. ఈసందర్భంగా బీఎల్‌వోలకు దరఖాస్తుల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. తహసీల్దార్ షేక్.నాగూర్‌మీరా, మధు, సిబ్బంది పాల్గొన్నారు.

వెలిగండ్ల: మండలంలోని కంకణంపాడు, వెలిగండ్లలో ఏర్పాటు చేసిన పోలింగ్‌బూత్‌లను ఆర్‌డీఓ పాలపర్తి జాన్ ఇర్విన్ శనివారి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ బీఎల్‌ఓలు ఆదివారం కూడా అందుబాటులో ఉంటారన్నారు. అనంతరం స్థానిక కేజీబీవీ లో స్వీప్ ప్రోగ్రామ్‌లో భాగంగా 18 ఏళ్లు నిండిన బాలికలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక జెడ్పీహైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. ఈయన వెంట తహసీల్దార్ ఎన్ వాసు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. హనుమంతునిపాడు: మండలంలోని హాజీపురం, సీతారాంపురం సచివాలయ పరిధిలోని బూత్‌లను ఆర్డీఓ పి.జాన్ ఇర్విన్ పరిశీలించారు. ఓటర్ల జాబితాలో తప్పిదాలు లేకుండా పరిశీలించి జాబితాను అందజేయాలని బీఎల్‌ఓలకు సూచించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మానుగుంట

కందుకూరు: ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కును స్థానిక కార్యాలయంలో ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఉలవపాడు మండలం చాకిచర్ల గ్రామానికి చెందిన పున్నేపల్లి సుధాకర్ తీవ్ర అనారోగ్యంతో చికిత్స పొంది మంచానికే పరిమితమయ్యారు. ఈ క్రమంలో కుటుంబ పోషణ భారంగా ఉండడంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని ఎమ్మెల్యే ద్వారా దరఖాస్తు చేస్తున్నారు. ఈమేరకు రూ. 2 లక్షలు మంజూరైయ్యాయి. ఈ చెక్కును సుధాకర్ కుటుంబ సభ్యులకు శనివారం ఎమ్మెల్యే అందజేశారు. అలాగే కందుకూరు మండలం కోవూరు గ్రామానికి చెందిన చిమ్మిరి రమాదేవి అనారోగ్యంతో చికిత్స పొంది, ఆర్థిక సాయం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు ద్వారా దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ. 1.60లక్షల చెక్కును వైఎస్సార్‌సీపీ పట్టణ యూత్ అధ్యక్షుడు రాజారెడ్డి చేతుల మీదుగా శనివారం అందజేశారు. ఈ సందర్భంగా రమాదేవి ఎమ్మెల్సీ తూమాటికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

- జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి

టంగుటూరు: ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి అన్నారు. మండలంలోని మర్లపాడులో ప్రకృతి వ్యవసాయం దిశగా సాగుతున్న ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ న్యాచురల్ ఫామింగ్ ఆధ్వర్యంలో ఏటీఎం మోడల్‌ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఎం సుభాషిణి రైతులకు సూచనలు, సలహాలు అందించారు. యరజర్లకు వెంకట సుబ్బయ్య దేశీయ విత్తనం నాటు రకం బహు రూపి నాటు విత్తనాన్ని శ్రీహరి పద్ధతిలో న్యాచురల్ ఫామింగ్ పద్ధతిలో నాటారు. ఈ సందర్భంగా డీపీఎం మాట్లాడుతూ ఆహారం తీసుకోవాలంటే ప్రకృతి వ్యవసాయం అవసరమని, ప్రతి ఒక్క రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని కోరారు. ప్రకృతి సేద్యం ద్వారా సాగు చేసిన పంటలు తిన్న వారికి సంపూర్ణ ఆరోగ్యం దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారులు సత్య శ్రీకాంతు, యూనిట్ ఇన్‌చార్జి విజయలక్ష్మి, ఐసీఆర్పీలు మరియమ్మ, సుజాత, హరిత, జోత్స్న, శృతి, రైతులు పాల్గొన్నారు.

మామిడి ఎగుమతులకు ఒప్పందం


బెంగుళూరులో ఇన్నోవా సంస్థతో రైతుస్ఫూర్తి కంపెనీ ఒప్పందం.

ఉలవపాడు: మామిడి ఎగుమతులకు ఉలవపాడుకు చెందిన రైతు స్ఫూర్తి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ బెంగుళూరుకు చెందిన ఇన్నోవా అగ్రి బయోటెక్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు కంపెనీ సీఈఓ బాలచంద్ర తెలిపారు. మామిడి పండ్ల సీజన్‌లో రైతులకు గిట్టుబాటు ధర అందించాలని పంట మొత్తం ఎక్కువ మొత్తంలో రైతులు అమ్ముకోవడానికి ఇన్నోవా సంస్థ ఒప్పుకున్నట్లు తెలిపారు. ఈ సంస్థ మామిడి పూత దశ ప్రారంభం నుంచే శాస్త్రవేత్తల ద్వారా సస్యరక్షణ చర్యలపై పూర్తి అవగాహన కల్పిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ ద్వారా సలహాలు అందించనున్నట్లు తెలిపారు. రైతులు తెగుళ్లకు సంబంధించి ఫొటోలు పెట్టిన వెంటనే నివారణ చర్యలు తెలియచేస్తారని తెలిపారు. ఈ ప్రాంతంలో పంటను మంచి ధరకు కొనేలా చేస్తామని తెలిపారు, రైతు స్ఫూర్తి ఎండీబీ వేణు, డైరెక్టర్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

అర్హులంతా ఓటరుగా నమోదు కావాలి


మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ మనోహర్

కందుకూరు రూరల్: అర్హులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.మనోహర్ అన్నారు. స్థానిక ఓవీ రోడ్డులోని గాయత్రి డిగ్రీ కళాశాలలో ఓటర్ల నమోదు ఆవశ్యకతపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు, నిండుతున్న వారు కానీ కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. డిసెంబర్ 9వ తేదీ నాటికి ఓటర్ నమోదు ప్రక్రియ గడువు ముగుస్తుందన్నారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. మరికొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అర్హులంతా ఓటరుగా నమోదై నవభారత్‌ను నిర్మించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ భరద్వాజ్, ప్రిన్సిపాల్ గీతా శ్రీనివాస్‌లు మాట్లాడుతూ ఓటరు నమోదు కార్యక్రమానికి గాయత్రి కళాశాల తరపున పూర్తి సహకారాన్ని అందిస్తామని స్పష్టం చేశారు.

పెన్షన్ కానుక పేదలకు వరం

సీఎస్‌పురం (పామూరు): వైఎస్సార్ పెన్షన్ కానుక పేదలు, అవ్వా తాతలకు వరం లాంటిదని సర్పంచ్ షేక్.ఖాదర్‌బీ అన్నారు. మండలంలోని కోవిలంపాడు సచివాలయంలో శనివారం జరిగిన కార్యక్రమంలో నూతనంగా మంజూరైన పెన్షన్ నగదును సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సుగుణ స్థానిక సర్పంచ్‌తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోమారు సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసేందుకు ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మైనారిటీసెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు షేక్.బజాజ్‌బుజ్జి, గోను వెంగళరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలతో రైతులకు లబ్ధి

- జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి శైలజరాణి


రైతు సదస్సులో పాల్గొన్న వ్యవసాయాధికారులు, రైతులు

కొండపి(సింగరాయకొండ): రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసుకోవటం ద్వారా రైతులకు ఎంతో లబ్ధి చేకూరుతుందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి ఏ శైలజరాణి అన్నారు. కొండపి మండలంలోని కొండపి-1, కట్టావారిపాలెం రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతు ఉత్పత్తిదారుల సంఘాల రైతులకు వారు సాగు చేసే పంటలో మేలైన యాజమాన్య పద్ధతులపై నిర్వహించిన శిక్షణలో ఆమె పాల్గొన్నారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసే పద్ధతి, ప్రయోజనాలు, పంటలు వారి వాట్సాప్ గ్రూపుల ద్వారా సాంకేతిక సమాచారాన్ని రైతులకు ఏవిధంగా తెలియజేయవచ్చో వివరించారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి వీవీ శేషమ్మ మాట్లాడుతూ కంది, వరి, శనగ, పొగాకు, మిరప పంటల్లో వచ్చే పురుగులు, తెగుళ్లపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారి డి.విజయకుమార్ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. వెలుగు సీసీ ప్రసన్నలక్ష్మి, ఆరికట్ల హరినారాయణ, ఏఏలు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌తో మెరుగైన వైద్య సేవలు


జరుగుమల్లి: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజలకు సంతృప్తికర సేవలు అందిస్తున్నట్లు జరుగుమల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కంచుకొండ శ్రీధరరెడ్డి అన్నారు. మారుమూల ప్రాంతాలకు సైతం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా అన్ని రకాల వైద్య సేవలు అందించడం వల్ల ప్రజలకు వైద్యానికి అయ్యే ఖర్చు తగ్గిందన్నారు. మండలంలోని పాలేటిపాడులో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం శనివారం నిర్వహించారు. 122 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. హెల్త్ సూపర్‌వైజర్ సురేష్, ఏఎన్ఎం భారతి, ఎంఎల్‌హెచ్‌పీ అనిత పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పించాలి


ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్న అధికారులు రులు

కనిగిరి రూరల్: నూతన వ్యవసాయ సాగు పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించి, అధిక దిగుబడి, లాభాలు వచ్చేలా ఆర్‌బీకే సిబ్బంది, వ్యవసాయ సిబ్బంది పనిచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి జి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏడీఏ ఈ వెంకటరమణ అధ్యక్షతన కనిగిరి వ్యవసాయ సబ్ డివిజన్‌లోని రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎస్ వీవీ ఎస్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సిబ్బంది సరైన సమయంలో రైతులకు సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. వ్యవసాయ శాస్త్ర వేత్తలు టి.వెంకటేశ్వరరెడ్డి, ఎం జాహ్నవిలు మాట్లాడుతూ రబీలో సాగు చేసే పంటలైన జొన్న, పప్పు శెనగ, వరి, మినుము లలోని నూతన వంగడాలను గుర్చి చెప్పారు. డాక్టర్ ఎం శివ (ఉద్యాన విభాగ శాస్త్ర వేత్త) మిరప పంటల్లోని మేలైన యాజమాన్య పద్ధతులను గుర్చి తెలిపారు. అనంతరం ముందస్తు మూల్యాంకణ పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన వెంగళాయపల్లి , పీసీపల్లి ఆర్‌బీకేల్లోని సిబ్బందిని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు అభినందించి, బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఏఓలు పి.జోత్స్నాదేవి, ఎస్ రంగకృష్ణా, కె.రాధ, కేవీ రమణ, జి.వెంకటస్వామి, ఏఈఓ గోపీకృష్ణ, వీఏఏలు, వీహెచ్‌ఏలు పాల్గొన్నారు.

ఎస్సైగా నాగరాజు బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎస్సై నాగరాజు

కొండపి(సింగరాయకొండ): కొండపి ఎస్సైగా వై నాగరాజు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ట్రైనీ ఎస్సైగా మండలంలో విధులు నిర్వహించడంతో కొంత అవగాహన ఉందన్నారు. ట్రాఫిక్ సమస్యపై ప్రధానంగా దృష్టి పెడతానని అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించనన్నారు.

దివ్యాంగులకు అన్నదానం

కందుకూరు రూరల్: మానసిక దివ్యాంగుల మధ్య పట్టణానికి చెందిన గుర్రం శింగయ్య-నిర్మలాదేవిల వివాహ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక కోవూరు రోడ్డులోని స్వర్ణ స్వయం కృషి మానసిక దివ్యాంగుల పాఠశాలలో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంతో వివాహ వార్షికోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా దంపతులు పాల్గొని దివ్యాంగులకు అన్నదానం చేశారు.

రైతువారి కుంటలకు ప్రాధాన్యం ఇవ్వాలి


గ్రామసభలో మాట్లాడుతున్న ఏపీడీ వెంకటస్వామి

టంగుటూరు: పొలాల్లో రైతువారి కుంటలకు అధిక ప్రాధ్యాన్యం ఇవ్వాలని ఏపీడీ వెంకటస్వామి అన్నారు. మండలంలోని తూర్పునాయుడుపాలెంలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి శనివారం గ్రామసభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ గ్రామ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, రైతులు, మేట్లు, కూలీలు, గ్రామస్తుల భాగస్వామ్యంతో రెండవ గ్రామ సభలో తూర్పునాయుడుపాలెంలో 12,016 పని దినాలకు లెబర్ బడ్జెట్ వేసి పనులు గుర్తించామన్నారు. ఏపీఓ సుభాషిణి, ఈసీ దివికుమార్, టీఏలు లుథియా, శ్రీను, శంకర్, ఏఫ్ఎ, సిబ్బంది పాల్గొన్నారు.